REGD. NO. A. 40 — విడి ప్రతి 0-3-0 — 15-8-58 శుక్రవారం

# జమీన్ రైతు

సంపుటి 30 ⁑ మేనేజింగు ఎడిటరు : నెల్లూరు వెంకట్రామానాయుడు :: సంపాదకుడు : నెల్లూరు శ్రీరామమూర్తి ⁑ సంచిక 33

## హైదరాబాద్ లేఖ

*** మా విలేకరి ***

## సమాచారశాఖ రాజకీయాలు

—o—

### ఉప సంఘంలోకి ఒక సమర్థుడైన పరాయి రాష్ట్రం వ్యక్తిని తీసుకొనివుంటే బాగుండేది

—o—

రాష్ట్ర సమాచార, పౌరసంబంధాలశాఖ నుంచి అత్యధిక ఉపయోగం, ప్రయోజనం పొందేటందుకు తీసుకోవలసిన చర్యలను సూచించమని రాష్ట్రప్రభుత్వం ఆంధ్రప్రభ సంపాదకులు శ్రీ నార్ల వెంకటేశ్వరరావు అధ్యక్షతన ఒక సంఘాన్ని నియమించింది. గోలకొండ పత్రిక సంపాదకులు శ్రీ నరోత్తమరెడ్డి, ఆంధ్రజనత సంపాదకులు శ్రీ కూచిమంచి సుబ్రహ్మణ్యం ఈసంఘ సభ్యులుగా వ్యవహరిస్తారు.

ప్రణాళిక, అభివృద్ధిశాఖ మంత్రి శ్రీ వల్లూరు బసవరాజుగారు సమాచార శాఖాధిపత్యంకూడా వహించిన తరువాత, ఈ శాఖ గురించిన ఈ పనిని ప్రభుత్వం తలపెట్టింది. ఇప్పటికైనా సమాచారశాఖగురించి తీవ్రంగా ఆలోచిస్తున్నందుకు ప్రభుత్వాన్ని అభినందించాలి. (నిజానికి ఈ ముగ్గురు సంపాదకుల సంఘం ఆచరణసాధ్యమై, ఉపయోగకరమైన సూచనలు చేసి, వాటిని సెక్రటేరియట్ ఫైళ్లలో క్రిమికీటకాదులకు ఆహారంగా వదలివేయక అమలుజరిపినప్పుడు కాని ప్రభుత్వాన్ని అభినందించడానికి వీల్లేదు.)

ఆధునిక ప్రభుత్వ యంత్రాంగంలో, ముఖ్యంగా అభివృద్ధికి ప్రణాళికా బద్ధమైన మార్గాన్ని అవలంబించిన ఈ రోజుల్లో, సమాచారశాఖ ఒక ప్రధానమైనభాగం. సరిగ్గా ఈ విషయాన్ని ఐ.సి.యస్. ఉద్యోగుల సలహాలతోను, పెత్తనంక్రిందను నడిచే మన ప్రభుత్వం గుర్తించ నిరాకరిస్తున్నదని చెప్పాలి.

పూర్వం — అంటే హైదరాబాదు సంస్థానంరోజుల్లో, సమాచారశాఖపై ప్రభుత్వం లక్షలు ఖర్చుచేసేది. అయితే ఈ లక్షల వ్యయంతో జరిగే ప్రచారంవల్ల రాష్ట్రప్రజలకేమీ ఒరిగేదికాదు. సంస్థానేతర ప్రాంతాల్లో సంస్థానప్రభుత్వ ఔదార్యం, ప్రజల శ్రేయోభిలాష, నిష్పాక్షిక పరిపాలన మొదలైనవాటి గురించి ప్రచారంచేయడమే ఈశాఖ ప్రధాన బాధ్యత. ఇందుకోసం పెద్దపెద్ద పత్రికాధిపతులను ఆదరించడం, పత్రికా రచయితలను "సంతృప్తి" పరచడం మొదలైనవన్నీ సమాచారశాఖ డైరెక్టరు చేయవలసిన పనులు. ఇందుకోసం ఆయనక్రింద చాలాడబ్బు వుంచేవారు. ఇవన్నీ కాగితంమీద పెట్టతగినవికావు కాబట్టి వాటికి లెక్కవివరంకూడా ఉంచడానికి వీల్లేదు. పోలీసుచర్యకుపూర్వం రజాకార్ల హయాంలో ఈ "ప్రచారం" పరాకాష్ట నందుకున్నది. ప్రచారంకంటే దుష్ప్రచారం ఎక్కువైంది.

భారతయూనియన్‌లో హైదరాబాదు విలీనమైన తరువాత మిలిటరీ పరిపాలన క్రింద తరువాత బూర్గుల రామకృష్ణారావు హయాములో ఈ శాఖపై జరుగుతున్న వ్యయాన్ని చాలావరకు తగ్గించివేశారు. విదేశప్రచారాన్ని పూర్తిగా నిలిపివేశారు. అయినా బూర్గులవారు సంప్రదాయాలంటే మక్కువ కలవారు కాబట్టి, పూర్వపు సంస్థాన ప్రభుత్వపు "ఔదార్యాన్ని" కొంత నిలబెట్టారు. దాదాపు రూ. 2,000 నెలకు వేతనం తీసుకుంటున్న డైరెక్టరు, అతనిక్రింద ముగ్గురో నలుగురో డిప్యూటీ డైరెక్టర్లు ఉన్నప్పటికీ, ఆల్ ఇండియా రేడియోలో పనిచేస్తున్న శ్రీ కపిల కాశీపతిని రూ.1200 వేతనంపై మాస్ కమ్యూనికేషన్స్ ఆఫీసరుగా నియమించారు. అప్పటి డైరెక్టరు శ్రీ బినోద్ రావు, ఈయన సమర్థులే కాబట్టి, ఉభయులు కొంత కొంత పనిచేసినప్పటికీ కార్యాలయమంతా రెండు ముఠాలుగా చీలి, పోటీలతో కాలయాపన జరిగేది.

ఆంధ్రప్రదేశ అవతరణానంతరం ప్రభుత్వ వైఖరి పూర్తిగా మారిపోయిందని చెప్పాలి. బినోద్ రావు బొంబాయి వెళ్ళిన తరువాత కాశీపతిని డైరెక్టరుగా నియమించారు. ఈయన శాఖాధిపత్యం వహించిన వెంటనే సమాచార శాఖ నిర్వహణలో కొన్ని మార్పులను ప్రవేశపెట్టారు. "ఆంధ్రప్రదేశ్" అను చక్కని మాసపత్రికను ప్రారంభించారు. ఇంతలో సంవత్సరంకూడా నిండకముందే ఆయన్ను మళ్ళీ ఆల్ ఇండియారేడియోకి పంపించి వేశారు. త్రిపురనేని గోపీచంద్ గారికి ఉద్యోగ కాలపరిమితి పొడిగించకుండా ఆయన్ను వెళ్ళిపొ

—కొరవ 12 వ పేజీలో

## ఆత్మకూరు ఉపఎన్నిక

ఆత్మకూరు ఉపఎన్నికకు బయటవారిని కాంగ్రెస్ అభ్యర్థిగా నిర్ణయించడం రాష్ట్రకాంగ్రెస్ నాయకులకు యిష్టంలేనట్లు తెలుస్తున్నది.

కాంగ్రెసు అభ్యర్థిగా శ్రీ తిరుపతి నాయుడుగారిని నిలబెట్టడం ఉత్తమంగా వుంటుందని రాష్ట్ర నాయకులు ఏకగ్రీవాభిప్రాయాన్ని కలిగియున్నారనీ, శ్రీ తిరుపతినాయుడుగారు అభ్యర్థిగావుండుటకంగీకరించని యెడల శ్రీ ఆనం సంజీవరెడ్డిని అభ్యర్థిగా వుంచుటకు ఆలోచిస్తున్నారని తెలుస్తున్నది.


ఆరోగ్య కారణాలవల్ల శ్రీ రేబాల దశరథరామరెడ్డిగారు పోటీచేయుటకు తన విముఖతను జూపారు

## కాంగ్రెసుపార్టీనుండి 40 మంది శాసనసభ్యులు నిష్క్రమిస్తారా?

మాజీలోక్‌పార్టీకి జెందిన లచ్చన్న ప్రభృతులు, మరికొంతమంది కాంగ్రెసుపార్టీ శాసనసభ్యులు దాదాపు 40 మంది, కాంగ్రెసునుండి నిష్క్రమించనున్నారని ఆంధ్రప్రదేశ్ రాజధాని హైదరాబాదులో ఎక్కువ వదంతిగావున్నది. వీరిలో శ్రీ జాగర్లమూడి చంద్రమౌళి, శ్రీ కాకాని వెంకటరత్నంగారలుగూడా వుండవచ్చునంటున్నారు.

ఆచార్య రంగా, శ్రీ కల్లూరు చంద్రమౌళిగారలుమాత్రం కాంగ్రెసులోనే వుండిపోగలరనికూడ రాజధాని రాజకీయ వర్గాలనుండి వినవస్తున్నది.

స్వాతంత్ర్యారాధన తర్వాత—కళారాధనే!



రాయవరపు శంకరయ్యా అండ్ సన్సు

( Experts In Silks )

ట్రంకురోడ్డు TEL : 138 నెల్లూరు

RATES ARE FIXED PLEASE

గవర్నరు వుపన్యాసం ఉత్సాహం కల్గించకపోయినా

# శాసనసభలో చర్చమాత్రం కుతూహలం కల్గిస్తున్నది

—o—

## కోయిలకుంట్ల ఉపన్యాసం గొడవ : ముఖ్యమంత్రి మీద ఎన్నడూలేని విమర్శల పరంపర

ఆంధ్ర శాసనసభ, కౌన్సిల్ సంయుక్త సమావేశం ప్రప్రథమంగా 9 తేది జరిగింది. శ్రీ భీమసేన్ సచార్ గవర్నరు పదవిని స్వీకరించి సంవత్సరానికిపైగా అయినా యిప్పటికి వారు శాసనసభలో వుపన్యసించలేదు. మొదటిసారిగా మొన్న 9 తేది వుపన్యాసం చేశారు.

గవర్నరు వుపన్యాసంలో, యింతకుక్రితం మనం విననివిషయాలు, మనకు తెలియని సమాచారాలు లేవు. గత రెండు సంవత్సరాల ప్రభుత్వ కార్యకలాపాల సింహావలోకనమే గవర్నరుగారి వుపన్యాసం. అందువల్లనే సచార్ గారి వుపన్యాసం ప్రజలలో ఎటువంటి ఆసక్తినిగాని, ఆశ్చర్యాన్నిగాని కల్గించలేదు. శాసనసభల ప్రారంభంలో గవర్నరు వుపన్యాసం విధిగావుండవలసిన రాజ్యాంగ సాంప్రదాయమొకటున్నది కాబట్టి జరిగిన వుపన్యాసమేగాని, ప్రజలకు వుత్సాహం కల్గించే క్రొత్త విషయాలు తెల్పడంగాదు.

గవర్నరుగారు భూసంస్కరణలు మొదలు బస్సుల జాతీయకరణంవరకు వివిధ విషయాలను తన వుపన్యాసంలో ప్రస్తావించారు.

భూసంస్కరణలబిల్లు యీ సమావేశంలో చర్చకు రాగలదని, భూసంస్కరణలు రైతుల శ్రేయానికి, రాష్ట్ర ఆర్థికోన్నతికి, అధికోత్పత్తికి దోహదమీయగలవని వెలిబుచ్చారు. ప్రథమ పంచవర్ష ప్రణాళిక కాలంలో ఆహార ధాన్యాలవుత్పత్తి 40 లక్షల 10 వేలనుండి 54 లక్షల 21 వేల టన్నులకు పెరిగిందని, అది ద్వితీయ ప్రణాళిక కాలంలో 70లక్షల 64 వేల టన్నులకు పెరగాలనేది ప్రభుత్వ లక్ష్యమని సచార్ గారన్నారు. గత సంవత్సరం 2 లక్షల 8 వేల టన్నులు అధికోత్పత్తి జరిగిందని, యీ సంవత్సరం 5 లక్షల 39 వేల టన్నులు హెచ్చువుత్పత్తి సాధించడం ప్రభుత్వసంకల్పమని తెలిపారు.

ఎరువులు, న్యూస్ ప్రింటు, మెరైన్ డీజల్ యింజన్ ఫ్యాక్టరీలను నిర్మించని కేంద్ర విధానంపట్ల అసంతృప్తి వెలిబుచ్చబడింది. సహకారపద్ధతిలో అయిదు చక్కెర ఫ్యాక్టరీల నిర్మాణం జరిగే అవకాశమున్నదన్నారు.

నిర్మాణమైన ప్రాజెక్టుల పూర్తి వినియోగం విషయంలో సత్వరచర్యలు గైకొనుటకు రివిన్యూబోర్డు మెంబరు ప్రత్యేకంగా శ్రద్ధ గైకొనగలరన్నారు. ఎగువ సీలేరు జలవిద్యుత్ ప్రాజెక్టు నిర్మాణానికి కేంద్ర సాంకేతిక ఆమోదంకొరకుఎదురు చూస్తున్నామన్నారు. కడప కర్నూలుకాల్వ, రాజోలుబండ ఆయకట్టు అభివృద్ధికి మరికొంత కేంద్రసహాయం కావాలన్నారు. తెలంగాణాలో విద్యుచ్ఛక్తి అభివృద్ధికి ఒక కోటి రూపాయలు అదనంగా కేటాయించబడిందని, యీ సంవత్సరం 3, 4 వందల తెలంగాణా గ్రామాలకు విద్యుచ్ఛక్తి లభించగలదన్నారు.

కాకినాడ, వరంగల్లులలో రెండు వైద్య కళాశాలలు నెలకొల్పబడగలవని పేర్కొన్నారు. పాఠ్యపుస్తకాల ప్రచురణను ప్రస్తావించారు. గ్రాంటుపాఠశాలలను స్వాధీనం చేసుకునే పథకం అనంతపురంజిల్లాకు విస్తరింపజేయబడగలదన్నారు.

కృష్ణజిల్లాలో బస్సుల జాతీయకరణానికి ప్రజలు సంతోషించారంటూ, క్రొత్తబస్సులు లభ్యమైన వెంటనే యితర జిల్లాలలో దీనిని ప్రవేశపెట్టడం, తెలంగాణా పాత బస్సుల స్థానంలో క్రొత్తవి వేయడం జరుగగలదన్నారు.

ప్రభుత్వోద్యోగులకు శక్తికిమించి సహాయం చేయడం జరిగిందని, జీతాల పెంపకంవల్ల 2½ కోట్లు ఖర్చు పెరిగిందని వివరించారు.

దేవాదాయ ధర్మాదాయాలలోని నిధుల నుండి అంగవికలురైన పేదల సంరక్షణకు గృహాలు నిర్వహించే ఏర్పాటు చేయబడగలదన్నారు.

ద్వితీయ ప్రణాళికలో ఆంధ్రకు కేటాయించిన 175 కోట్ల 74 లక్షలలో, యీ సంవత్సరాంతానికి (అంటే ప్రణాళిక మూడవ సంవత్సరాంతానికన్నమాట) 84 కోట్లరూపాయలు ఖర్చు కాగలదని వెల్లడించారు.



ఆంధ్రప్రదేశ్ గవర్నరు
శ్రీ భీమసేన్ సచార్

### విమర్శలు

గవర్నరుగారి వుపన్యాసంమీద శాసనసభలోగాని, కౌన్సిల్లోగాని సభ్యులనుండి వినబడిన విమర్శలలో ముఖ్యమైనవి రాష్ట్రంలో - ముఖ్యంగా రాయలసీమలో - కాటక పరిస్థితులనుగూర్చి వుదహరించలేదనేది ముఖ్యం. కమ్యూనిస్టు సభ్యులుమాత్రం ప్లాను కౌన్సిల్లో తమకు ప్రాతినిధ్యం లభించలేదని వాపోయారు.

చర్చలో రాయలసీమ సభ్యులు-ముఖ్యంగా కాంగ్రెసేతరులు-రాయలసీమ జిల్లాలలో శాంతిభద్రతలంటూలేదని నిశితంగా విమర్శించారు. కేరళలో తమ ప్రభుత్వంమీద వస్తున్న ఆరోపణలనుండి ప్రజలదృష్టిని మరలించుటకు కాబోలు, కమ్యూనిస్టులు శాసనసభలో శాంతిభద్రతల అవకాశాన్ని చక్కగా వినియోగించుకున్నారు.

ప్రతిపక్షాల విమర్శలెట్లున్నా, గవర్నరుగారి వుపన్యాసంలో యిరిగేషన్ వసతులకు సంబంధించి రాయలసీమ ప్రాజెక్టులే వుదహరింపబడినవిగాని, యితరవాటి ప్రసక్తిలేదు. కడప కర్నూలు కాలువపై యిప్పటికి పెట్టిందే శుద్ధ దండుగనే అభిప్రాయముంటే, ఆ ఆయకట్టు అభివృద్ధికి యింకా కేంద్రసహాయం కోరబడింది. కాని నిర్మాణం పూర్తిఅయిన క్షణంనుండి పూర్తి వుపయోగానికి రావడమేగాక, తక్కువ ఖర్చుతో విశేష లాభకారికాగల సోమశిల ప్రాజెక్టుగాని, కావలి-కనుపూరు కాల్వల ప్రసక్తిగాని లేదు. కడకు నాగార్జునసాగరు మొదటిదశలోనే ఆగదని, రెండవదశగూడా పూర్తిచేయబడుతుందనే ప్రజల భయ సందేహాలు పోగొట్టేమాట గవర్నరు వుపన్యాసంలో లేదు. అయితే మంత్రివర్గ విధానాలకు గవర్నరు వుపన్యాసం ప్రతిబింబం

—కొరవ 12 వ పేజీలో



# ★ హైదరాబాదు లేఖ ★

(మొదటి పేజీ తరువాయి)

మ్మన్నారు. హైదరాబాదు ప్రభుత్వం కిరం దను, తాత్కాలికంగా డైరెక్టరుగా వ్యవహరించమని నియమించారు.

ఇలాంటి మార్పులన్నీ చేసిన తరువాత ముఖ్యమంత్రిగారు సమాచార శాఖాధిపత్యాన్నుంచి తప్పుకొని తెలంగాణా అక్కన్న మాదన్నలలో ఒకరైన వల్లూరువారికి దాన్ని అప్పగించారు. ప్రభుత్వ ప్రచారమంతా సమాచారశాఖద్వారానే జరగాలని ఈ యన ఒక ప్రతిపాదన చేశారు. బొంబాయి మొదలైన ప్రగతిశీలమైన రాష్ట్రాలలో ఇలాగే జరుగుతుంది. కాని ఈ ప్రతిపాదనకు అడ్డం తగిలినది ప్రణాళిక శాఖా కార్యదర్శి సి. నరసింహంగారే. ఈయన ప్రణాళిక ప్రచారమంతా నేరుగా తమక్రింద ప్రణాళిక, అభివృద్ధిశాఖక్రింద జరగాలని పట్టుబట్టారు. సమాచారశాఖ డిప్యూటీ డైరెక్టరు శ్రీమతి రాజ్యం సిన్హాను మరికొందరు ఉద్యోగులను ప్లానింగ్, డెవలప్‌మెంట్ సెక్రటేరియేట్ భాగంగా మార్చి, వారిపై సమాచారశాఖ పెత్తనాన్ని తొలగించారు. పరిశ్రమల డైరెక్టరు మొదలైన ఉద్యోగులు తమ ప్రచారాన్ని తామే చేసుకుంటామని అనకపోయినా ఆక్షరాల అలాగే చేశారు. మరికొందరు ఇంకా చేస్తున్నారుకూడా. ముఖ్యమంత్రి, ఇతర మంత్రుల పత్రికా సమావేశాల గురించిన సమాచారం కూడా ఇవ్వలేని స్థితిలో సమాచారశాఖ డైరెక్టరు వున్నారు. ఈ శాఖకై బడ్జెటు కేటాయింపు ఏ ఆరులక్షలకో తగ్గించారు. డైరెక్టరు వలెనే మరికొందరు ప్రధాన ఉద్యోగుల నియామకం కూడా ఇంకా దాదాపు తాత్కాలికంగా అనిర్దిష్టంగా ఉంది. ప్రధానపత్రికల విలేకరులందరూవస్తే వారిని ఏ ప్రెస్ కాన్ఫరెన్సులో తీసికెళ్ళగల పెద్దకారుకూడాలేదు.

నేటి పరిపాలనా పద్ధతిలో సమాచార శాఖ అత్యంత ప్రధానమైనదనీ, ప్రభుత్వ ప్రచారమంతా దానిద్వారానే జరిగితే అటు ప్రభుత్వానికీ ఇటు సమాచారం అవసరమైన ప్రజలకుకూడా ఎంతో సౌకర్యం వుంటుందని మంత్రులు, ప్రధాన ఉద్యోగులు గుర్తించాలి. ఫలానిచోట ఫలానిమంత్రిగారి ప్రెస్ కాన్ఫరెన్సువుందని విలేకరులకే సమాచారమందించవలసిన స్థితిలో సమాచారశాఖ డైరెక్టరు ఉండకుండా అతనికి తగిన ప్రాముఖ్యత, హోదాను ప్రభుత్వం ఇవ్వాలి. కె.సి. కపాల్ మొదలైన ప్రాజెక్టులక్రింద కోటానుకోట్లు దుబారా అవుతున్నాయని పబ్లిక్ అకౌంట్సు కమిటీలు, ఎస్టిమేట్సు కమిటీలు చెబుతున్నప్పటికీ చీమైనా కుట్టినట్టు కనపడని ప్రభుత్వం, ప్రభుత్వానికీ ప్రజలకు సాన్నిహిత్యం చేకూర్చగల పౌర సంబంధాలశాఖపై ఖర్చుకు ఎందుకుజంకాలో తెలియదు. ప్రభుత్వపు ఈ వైఖరిలో మార్పు రాకపోతే ఎన్ని కమిటీలు వేసినా లాభం లేదు. ఇప్పుడు వేసిన కమిటీలోకూడా కమిటీ అధ్యక్షుడు మినహా, సభ్యులిద్దరికీ పత్రికా రచనలోకాని పబ్లిసిటీ వ్యవహారంలోకాని అంతగా అనుభవంలేదు. కాంగ్రెసు రాజకీయాలవలెనే ఈ కమిటీలోకూడా ముఖ్యమంత్రికీ, నీటిపారుదలమంత్రికీ, ప్రణాళిక మంత్రికీ నమ్మకమైన వ్యక్తులనే ఇందులో వేశారు. రాష్ట్రం వెలుపలనుంచి అయినా సమర్థుడైన మరొకవ్యక్తి సేవలను సేకరించి వుంటే బాగావుండేది. (12—8—58)

## గవర్నరు ఉపన్యాసం

(3వ పేజీ తరువాయి)

కాబట్టి, వారి వుపన్యాసంనుండి యింతకంటె ఆశించుటకు వీలులేదేమో!

### ముఖ్యమంత్రి కోయిలకుంట్ల వివాదం

ముఖ్యమంత్రి శ్రీ సంజీవరెడ్డిగారు గత 28 తేది కోయిలకుంట్లలో చేసిన వుపన్యాసంపై శాసనసభలో తీవ్రవాదోపవాదాలు జరిగినవి. కోయిలకుంట్ల శాసనసభ్యుడు శ్రీ బి. వి. సుబ్బారెడ్డి చాల తీవ్రంగా మాట్లాడారు. కాంగ్రెసేతరులను గాడిదలుగా పోల్చిన ముఖ్యమంత్రి గడుసుతనాన్ని నిశితంగా విమర్శించాడు. "అచ్చటి ప్రజలు అత్యంత వుద్రేకపరులు, దయచేసి అలా మాట్లాడకండి" అని హెచ్చరికకూడా చేశారు. తాను ముఖ్యమంత్రిగా అచ్చట ప్రసంగించలేదని, కాంగ్రెస్ వాదిగా ప్రసంగించానని, తాను సుబ్బారెడ్డి గారి పేరెత్తలేదని, యితరులను నొప్పించడం తన వుద్దేశ్యంకాదని సంజీవరెడ్డిగారు చాల నమ్రతగా జవాబు చెప్పకోవలసి వచ్చింది. తాను వుద్రేకంతో మాట్లాడింది యదార్థమేనని సంజీవరెడ్డి గారు అంగీకరించారు.

రామాయణంలో పిడకలవేట అన్నట్లు, కోయిలకుంట్ల వుపన్యాసం ఏపత్రికలో వేయబడిందనే విషయంలో వాదోపవాదాలు నడిచాయి. బి. వి. సుబ్బారెడ్డిగారు 'విశాలాంధ్ర'ను వుదహరించారు. అది కమ్యూనిస్టు పత్రిక, దానిని అంగీకరించలేమన్నారు సభాపతి శ్రీ కాశేశ్వరరావు. 'ఇండియన్ ఎక్స్‌ప్రెస్' వంటి ఏపార్టీకి చెందని పత్రికలో వచ్చివుంటే చూసవున్నారు. అది కాంగ్రెస్ పత్రికగదా అని ప్రతిపక్షాలవారు గోలచేశారు. కాని కాంగ్రెస్‌పత్రిక, ముఖ్యమంత్రికి అనుకూలమైన పత్రిక 'ఆంధ్రప్రభ' లో కూడా కోయిలకుంట్ల వుపన్యాసం ప్రకటితమైందనే విషయం గౌరవనీయ సభ్యులు గుర్తించినట్లు లేదు.

అధికారంలో వున్నవారు, బాధ్యతగల వ్యక్తులు బహిరంగ వుపన్యాసాలు చేసేటప్పుడు చాల నిగ్రహాన్ని ప్రదర్శించవలసి వుంటుంది. అదేమి గ్రహచారమోగాని, ఇతరులను నొప్పించకుండా శ్రీ సంజీవరెడ్డిగారి వుపన్యాసం వుండకపోవుండదు. అమధ్య, నెల్లూరులో ఒక ప్రసంగంలో ముఖ్యమంత్రిగారు దాక్షిణ్యాన్ని ప్రాసుకోరు తనంతో పోల్చారు. వారి ఆ అనాదిత్యపు పోలిక ఎందరు దాతల హృదయాలకు నొప్పికల్గించిందో తెలియదు. 'హంసగానం'తో ప్రారంభమైన సంజీవరెడ్డిగారి వుపాఖ్యలు, గాడిద పోతతో పరాకాష్ఠ చెందినవి.

మొత్తానికి ముఖ్యమంత్రిమీద, వారిమంత్రివర్గంమీద యీ సమావేశంలో వచ్చినంత విమర్శ యిదివరకెన్నడూ లేదేమో! కమ్యూనిస్టు యితర్యాది శాశ్వత వ్యతిరేకులుండనే వున్నారు; కనీసం యితరుల సానుభూతినైనా పోగొట్టుకోకుండడం అవసరంగదా!

శాసనసభ యీ సమావేశం యీ నెల 22 తేది వరకు జరుగుతుందట.

—ఒక పరిశీలకుడు


# మీకు మంచి— మీ దేశానికి మేలు

లేమి అనేది లేకుండా చేసుకోవాలనే జాతీయ ఆదర్శానికి రూపురేఖలు దిద్ది, గమ్యం వైపుకు నడిపించేదే ద్వితీయ పంచవర్ష ప్రణాళిక.

ఏ వృత్తిలో, ఏ వ్యాసంగంలో వున్నవారైనా ప్రణాళిక విజయానికి ఎంతో సహాయం చేయగలరు. ఈ సహకార బలంలో మనజాతి సంపద, సమృద్ధి సాధించుకొన గలుగుతుంది.

ఆహార ధాన్యాలు, పారిశ్రామిక వస్తువులు అధికంగా ఉత్పత్తిచేసి, సంఘ సంక్షేమ కార్యకలాపాలలో పాల్గొని, సొమ్ము ఎక్కువగా ఆదాచేసి జాతీయ పొదుపు సర్టిఫికేట్లలో పెట్టుబడి పెట్టండి—నవభారతాన్ని రూపొందించడంలో నిర్మాణాత్మకమైన మీ పాత్రను మీరు నిర్వహించండి. అది మీకు, మీ కుటుంబానికి ఎంతో మేలుచేస్తుంది.



ప్రణాళికకు సహకారం యివ్వండి

## మీ మేలుకు మీరు కృషిచేయండి

DA-58/172


Edited, Printed and Published by N. Sree Ramamurthy at the Zamin Ryot Power Press, 170, Thipparaiuvari St. Nellore.